
# డా(ల)ర్లింగ్

కథ

ఇచ్ఛాపురపు రామచంద్రం

'నమస్కారం, రండి, కూర్చోండి'' అంటూ తన బల్లకటువేపున్న కుర్చీ చూపించాడు లాయర్ సూరిగా పేరొందిన చిన్నయసూరి.

''దీర్ఘాయుష్మాన్‌భవ. నా పేరు పతంజలి. విశ్రాంతి ఉద్యోగిని. వీడిపేరు కృష్ణ. బాలసారెనాడు పెట్టబడినపేరు. వీడూ నేనూ ప్రగాఢ స్నేహితులం. వచ్చేనెల ఒకటో తారీఖున వీడి పుట్టిన రోజు. మూడేళ్ళు నిండుతాయి. లా ఆఫ్ లిమిటేషన్స్ అంటారు కాబోలు మీ పరిభాషలో. దారుణమేమిటంటే-మా స్నేహానికీ, వీడిపేరుకీ కూడా కాలదోషం పట్టించాలని కుట్ర జరుగుతోంది. అలా జరగకుండా నివారించగలరేమో అని మీ వద్దకు వచ్చాం'' అన్నారు పతంజలి కృష్ణని వొడిలో కూర్చోబెట్టుకుని.





'ప్లీడరు గారికి చిత్రంగా అనిపించింది. అరవైదాటిన వృద్ధుడికీ, మూడేళ్లయినా లేని పిల్లవాడికీ ప్రగాఢస్నేహం! పేరుకి కాలదోషం పట్టించాలని కుట్ర! వీళ్ళ వింత స్నేహానికి శత్రువులు. ఆశ్చర్యంగా చూశాడు పతంజలివేపు. ఆ చూపులో అనుమానం.

''అయ్యా నేనుండేది ఆ దగ్గరలో లాసెన్స్‌బేలో అయినా నేను పిచ్చాసుప్రతి నుంచి వచ్చిన బాపతుని కాదు. నా సమస్య బట్టి అలా అనిపించవచ్చు. కాని వివరాలు వింటే నా బాధ అర్థమౌతుంది. మీ కాలం విలువ తెలిసినవాడినే కనుక మీరు మా కోసం వెచ్చించే ప్రతినిముషానికీ ధర చెల్లిస్తాను. కాకపోతే. నేను చెప్పేది సోదిలా అనిపించినా తరవాత దాని అర్థం, ప్రయోజనం అవగతమౌతాయి. ఒక ప్రార్థన ఏమిటంటే మా ఫిర్యాదుని మీరు కోర్టుకి తీసుకెళ్లగలిగే వరకూ రహస్యంగా ఉంచాలి'' అన్నారు పతంజలి.

''అది మా కోడాఫ్ కాండక్ట్..'' అంటూ ఆయన వడిలోని కృష్ణని చూసారు లాయర్. ముద్దుగా, బొద్దుగా ఉండి తాతకూచిలా అనిపిస్తున్నాడు.

ఇంటిపేరు కస్తూరివారు, ఇంట్లో గబ్బిలాలకంపు అన్నట్లు పేరులోనే సూరి తప్ప నోరువిప్పితే ఆంగ్ల భాషే అని మనసులో అనుకుంటూ.. ''ఉద్యోగం వదలక మునుపే ఊర్మిళ నన్ను వదిలేసి పైలోకానికి వెళ్లిపోయింది. నేను విధురుడిని'' చెప్పారు పతంజలి.

''అంటే'' అని సూరిగారు నసిగేసరికి ఆంగ్లమానసపుత్రులు అని మనసులో చికాకుపడుతూ ''భర్త చనిపోయిన స్త్రీ విధవ. భార్య చనిపోయిన మగవాడు విధురుడు'' అని వివరించి....''నేను ఆ వూళ్ళోనే ఒంటరిగా ఉండేవాడిని, ఉద్యోగం నుంచి విరమించినా ఇక్కడ మా అబ్బాయీ కోడలూ అంతవరకూ పెదవుల చివరనుంచి పదిమంది కోసమూ నన్ను వొచ్చి వారితో ఉండమనేవారు కాస్తా ఒక్కసారిగా తమ పిలుపులని తీవ్రంచేశారు. అది వృద్ధుడినయిన నా పట్ల అభిమానమే అనీ, నేను వెళ్లివారితో ఉండడమే మంచిదనీ భావించి అక్కడి స్థిరాస్తులను 'అమ్మబోతే అడివి, కొనబోతే కొరివి' అనే సామెత సత్య మౌతున్నా తక్కువ ధరకే అమ్మి పారేసి అన్నిటినీ చరాస్తిగా బ్యాంక్‌లోనూ, పోస్టాఫీసు పథంకంలోనూ వేసి కొడుకు దగ్గరకి వచ్చేశాను. నేను రావటమేమిటి, కోడలు ఉద్యోగంలో చేరింది. ఇంటి కాపలాగా నేనున్నాను కనుక అబ్బాయి 'నిశ్చింతగా హాయిగా' ఉండసాగాడు. ఏ ఒంటరితనాన్నుంచి బయటపడాలనుకుని ఇక్కడికి వచ్చానో అవే యిక్కడా ఎదురయింది. కాకపోతే అక్కడి కంటే యిక్కడివి పెద్ద పరిధి. ఈ ఇంటింతటికీ నేనొక్కడినే.

వాళ్ళు ఎప్పుడో వస్తారు, వెళ్తారు. ఎలాటి నాణానికైయినా రెండువేపులా ఉంటాయి కనక నా ఒంటరితనాన్ని 'స్వేచ్ఛ ఇష్టారాజ్యం' అని కూడా అనుకోవచ్చు.

ఆ ఇంటి నిర్వహణ నా అప్రకటిత బాధ్యత అయింది. నేనూ ఆ విధిని స్వతంత్రంగానూ, పెద్దరికానికి లభిస్తున్న గౌరవంగానూ భావించుకున్నాను. 'ప్రమాదో ధీమతామపి' బుద్ధిమంతులు అంటే తెలివయినవారికే పొరపాట్లు తప్పనప్పుడు నాలాటి సామాన్యుడి సంగతి చెప్పేందుకేముంది? వాళ్లు ఇల్లు వదిలేటప్పుడు హడావిడి. ఇల్లు చేరేసరికి నేను గాఢనిద్రలో. అందుచేత నాతో మాట్లాడడానికే వారి తీరికలేని 'తొందర' దినచర్యలో వేగవంతమైన నాగరిక జీవితంలో అవకాశం చిక్కేది కాదు. అయినా ఇల్లు మాత్రం నడిచిపోతూంది. రోజులు గడిచి పోతున్నాయి. అలా ఏడాదిన్నర. నా మనసులోని కోరిక వారికి చెప్పడానికి సందర్భమే చిక్కలేదు. ఆపైన. సంకోచం.

ఆ వేళ... ఉదయం దంపతులిద్దరూ చెరో తోవనా కాక ముందూ వెనక కాక కలిసి బయటకు వెళ్లారు. శలవు దినం కాకపోయినా. అలాటి వైపరీత్యం సంభవించడం ఆనాడే మొదటిసారి నేనిక్కడికి వచ్చాక. వెళ్తూ వారేమీ చెప్పలేదు. అడగడానికి నా అహం అడ్డుపడింది. కనుక వాళ్లొచ్చేవరకూ చూసి వాళ్ళతో కలసి భోజనం చేద్దామనీ, అప్పుడు నా ఆత్రుత తీరేలోగా విషయం తెలియవచ్చుననీ వారి రాక కోసం అభోజనంగా ఎదురుచూడసాగాను. ఆకలితో శోష వొస్తూంది నాకు కానీ అపరాహ్నం దాటినా వారు రానూ లేదు. టెలీఫోనూ లేదు. సొమ్మసిల్లి మంచం మీద వాలిపోయాను. ఎరక్కపోయివచ్చాను, యిరుక్కుపోయాను. వెనక్కి వెళ్ళే ద్వారం కూడా మూసేసుకుని చేయరాని పొరపాటు చేశాను. బతుకు విసుగేస్తోంది. ఎంత కొడుకయినా వీడింటి కావలివాడిగా ఉండడం నా అహాన్ని బాధిస్తోంది. ఏ వృద్ధాశ్రమానికయినా పోతే? ఇది అందమైన ఆనందం కలిగించే అనుబంధం కాదు, అష్టదిగ్బంధనం నా వేలితో నా కన్నే పొడుచుకున్నానా?

చీకటి పడబోతూంటే అబ్బాయీ, కోడలూ వచ్చారు. తలుపు తీశాను. వాళ్ల ముఖాలు వెలిగిపోతున్నాయి. వొస్తూనే నా చేతిలో ఒక చిత్రం పెట్టారు. క్యాలెండరు లాటిది. విప్పేసరికి చిన్నికృష్ణుడు. ఎంత అందంగా ఉన్నాడో చెప్పలేను. ఆ బొమ్మలోని అంతరార్థం అర్థమై ఆశీస్సులూ, అభినందనలూ, శుభాకాంక్షలూ చెప్పాను. వృద్ధాప్యమంటే కొంత ఛాదస్తం. ఆ పైన నా ఒంటరితనపు చెర నుంచి విముక్తి లభిస్తుందన్న ఆనందం కాగలకార్యం గంధర్వులే తీర్చినందుకు సంబరం. వీటితోనే నా కడుపు నిండిపోయింది. అయినా వాళ్ళతో కలసి అన్నం తిన్నాను. అంత ఆలస్యమెందుకయిందని అడగడం అడుగున పడిపోయింది. ఆ సంతోషంలో.

తొమ్మిదో నెల వొచ్చేవరకూ కోడలు ఉద్యోగానికి వెళ్తూనే ఉంది. ఆమెకి లేని బాధ నాకెందుకు! అలా పని చేయడమే ఆరోగ్యం గర్భవతికి అని నేను కలగ జేసుకోలేదు.

అవిభక్త కుటుంబ వ్యవస్థ అంతరించిపోయి ఉమ్మడి కటుంబాలు కూడా అరుదుగా మిగిలిన ఈ రోజులలో మా కోడలు ప్రసవానికి పుట్టింటికి వెళ్లినా ఆ చిన్న కుటుంబంలో బాలింతకి చేసేవారూ చూసేవారూ లేక చిన్ని కృష్ణుడ్ని కన్న నెలలోగానే వొచ్చేసింది. ఆనాటికే అబ్బాయి ఒకావిడని తీసుకొచ్చాడు తల్లినీ, పిల్లవాడినీ చూడడానికి నేను ''ఆయా'' అంటే వాళ్ళు ''కాదు గవర్నెస్'' అన్నారు. అవ్వంటే ఏమిటి, ముసలమ్మంటే ఏమిటిలే అని సర్దుకున్నాను. వచ్చి వారం తిరగకుండానే కోడలు శిశువుని ఆయాకప్పగించేసి తను ఉద్యోగంలో చేరిపోయింది సెలవులేదంటూ.

వెనకటితరం వాడిని కనక తల్లిపాలూ, అమ్మవొడీ, మాతృభాషా, ఆది గురువూ అంటూ ఉపన్యాసమిచ్చేసి బిడ్డ ఆలనా పాలనా తనే చూసుకోవాలని నొక్కి వక్కాణిద్దామన్నంత ఆవేశం నాలో కలిగింది కానీ–

అడ్డాలనాడే బిడ్డలుకాని వీళ్ళకే బిడ్డలు కలిగాక మన బిడ్డలా? కొడుకు ఆవిడకి సై అంటూంటే నేనేం చెప్పినా చెవిటివారి ముందు శంఖం ఊదడమూ, అనవసరంగా శత్రువు కావడమే కదా అని ఊరకుండిపోయాను. ఆ గవర్నెస్ మన దేశందిలా లేదు. ఇంగ్లీషుదిలా అనిపించింది. ఆభాషా...తీరూ మనవి కావు. గౌను వేసుకునే ఆమె కృష్ణుడిని పెంచబోవడం నాకు నచ్చలేదు. ఎబ్బెట్టుగా తోచింది. ఇల్లు ఇంగ్లీషయి పోతుందని పించింది ఒక్కరోజుకే.

''మీ కృష్ణుడు వొడిలో పడుకుండి పోయినట్లు ఉన్నాడు. మీ కిబ్బందిగా ఉంటే...''

''లేదు వాడు నా వొడిలో పడుకోకపోతేనే నా కిబ్బంది. లాయరుగారూ! మీ ఉద్దేశం గ్రహించాను. కాని నేను సోది అనిపించేటట్లుగా చెబుతున్నది పరిస్థితీ, మా మనోభావాలూ, అంతర్గత బాధా మీకు బాగా అవగతమవాలనే. న్యాయవాదిని కాకపోయినా ఫిర్యాదుని తయారు చేయడంలోనూ, రచయితని కాకపోయినా క్లుప్తత, సూటిదనం. గురించి అవగాహనలోనూ ప్రవేశం పొందినవాడినే. కృష్ణ నాకు శరీరంలో భాగంలా ఐపోయాడని ఒక్కముక్కలో చెబితే వినేవారికి పట్టదని నా భయం. ఇప్పటి వారికి గుండెకి తగులుతూ సెల్‌ఫోన్ ఎలాగో, నాకు తగులుతూ కృష్ణ అలాగ. అందుకు కారణాలు చెబుతాను'' అని ఆయన ముఖంలోకి చూశాను.

''చెప్పండి'' అన్నారు లాయరు, పతంజలిని చూడకుండా తేలుకుట్టిన దొంగలా తలవంచుకుని.

''కోడలు అదే కృష్ణని కన్నతల్లి కొడుకుని ఆయా మీద వదిలేసి తను ఉద్యోగమంటూ ఊరిమీద పడింది. డబ్బు ప్రేమని కొనజాలదు. ఆర్థిక సంబంధం మానవసంబంధాలకి గొడ్డలిపెట్టు. ఆయా గవర్నెస్ శిశువుని ధనస్ఫూర్తిగానే తప్ప మనస్ఫూర్తిగా పెంచదు. శిశువుని అన్ని విధాలా ఆరోగ్యకరంగా పెంచగలిగేది అకళంకమయిన అయినవారి అనురాగపూరితమయిన ఆలనే అని ఆయాని నా సహాయకురాలిగా మాత్రమే ఉంచుతూ నేనే శిశువుని పాలుపట్టసాగాను. నీళ్ళుపోశాను. ఎత్తుకుని తిప్పాను. తడిపిన గుడ్డలు తీసేసి పొడిగుడ్డలు వేశాను. ఉయ్యాలలో ఊపి జోలపాటలు పాడాను. అవసరమైనప్పుడు వైద్యుడి వద్దకు తీసుకెళ్లాను. సకాలంలో పోలియో మొదలైన డ్రాప్స్ వేయించాను. పక్కలో వేసుకుని పడుకున్నాను. ఎత్తుకు తిప్పుతూ చందమామని చూపుతూ గోరుముద్దలు తినిపించాను. వాడితో ఆటలాడాను. మాటలు నేర్పాను. కథలు చెప్పాను. జంతువుల గొంతులు ధ్వన్యనుకరణ చేసి నవ్వించాను. వీపు మీదెక్కించుకుని గుర్రమై సకిలించాను. గుమ్మడి పండు అంటూ తలమీద మోశాను. పద్యాలు పలికించాను. పాటలు నేర్పాను. ఒక్కముక్కలో యీ మూడేళ్ళపాటూ అమ్మనే అయ్యాను. ఆయా నాకు చేదోడు వాదోడు మాత్రమే. నేనేదో కష్టపడి పోయాననో, త్యాగం చేశాననో కాదు. మగపుట్టుక పుట్టినా ఒక శిశువుని పెంచడంలోని అద్భుతమయిన ఆనందాన్ని పొందగలిగిన అవకాశం లభించిందనీ, కృష్ణకీ నాకూ ఎలాటి అనుబంధం ఏర్పడి ఉంటుందో ఆలోచించమనీ చెప్పడానికే''.


''అర్థమయింది. కృష్ణని కన్న తల్లి మీ కోడలయితే పెంచిన తల్లి మీరు. పెంచిన ప్రేమ కన్నప్రేమ కంటే ఘనమైనదే. ఎన్నో సినిమాలు సీరియల్సూ కూడా వొచ్చాయి'' అన్నారు లాయరు.

పతంజలి నిట్టూర్చారు. తనమీదనో, ఎవరిమీదో జాలిపడుతున్నట్లు. ''నిన్న వాళ్లిద్దరూ ముందుగా వొచ్చి గవర్నెస్‌కి అందరికీ బల్లమీద భోజనం ఏర్పాటు చేయమని చెప్పినప్పుడే నా మనసేదో కీడు శంకించింది.

''వొచ్చే ఒకటో తారీఖున కృష్ణ పుట్టిన రోజు'' అంది కోడలు. అనవసరంగా భయపడ్డానని నన్ను నేనే తిట్టుకుని గుండెల మీంచి కొండంత బరువు తీసినట్లు నిట్టూర్చాను తేలిగ్గా.

''చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చెయ్యాలి'' అని ఆమె నా వేపు చూసింది.

''ఔను'' అన్నాను. ఆనందపడిపోతూ. ఆతరంవాడినీ, అమాయకుడినీ, అనాగరకుడిని ముందున్నవి ముసళ్ళపండగ అనీ, యీ తరం వాళ్ళు చాలా తెలివైన వాళ్ళని, మూడెత్తులు ముందే వేస్తారనీ ఎంతకీ తెలుసుకోలేని మూర్ఖుడినని నన్ను నేను తెలుసుకోలేకా కాలం చెల్లిన నా మీద కోడలు వేసిన గాలమది అని కనుక్కోలేక వడిలో కృష్ణని నిమిరాను. ''మళ్ళీ మీతో యీ యింట్లో వాడి బర్త్ డే సెలబ్రేట్ చేసుకోము కదా!'' త్రుళ్ళిపడ్డాను. ''అంటే?



ఎందుకని?'' అయోమయంగా చూశాను.

''మీరు మరచిపోయారా? నేను – ప్రెగ్నెన్సీ కన్‌ఫమ్ చేయించుకుందుకు డాక్టరు దగ్గరకి వెళ్ళిననాడు ఉదయమనగా బయలుదేరి చీకటిపడ్డాక వచ్చాం'' ఐపోయిన పెళ్ళికి బాజాలెందుకూ? ఇప్పుడా చరిత్ర దేనికి? విషయం లోకి సూటిగా రా...అనేవాడినే, చెప్పింది కోడలుకాక అబ్బాయో కూతురు అయితే. ''ప్రెగ్నెన్సీ టెస్ట్ చేసి ధృవపత్రం యివ్వడానికి డాక్టరు గంటన్నర కంటే తీసుకోలేదు. అక్కడి నుంచి ఆ సర్టిఫికేటు కాపీలు తీయించి స్థానికంగా ఉన్న అమెరికన్ కాన్వెంట్‌కి వెళ్ళాం.''

''ఎలా ప్రసవించాలో క్లాసులు చెబుతారా అమెరికన్ కాన్వెంట్‌లో గర్భిణులకి పెద్ద మొత్తాలలో ఫీజులు పిండి? ప్రకృతి సహజమైన ప్రసవం గురించి పాఠాలెందుకూ? కడుపు వొచ్చినమ్మ కనకమానుతుందా? అనే మాట విన లేదా?'' అని అడగబోయి ఆగిపోయాను, కొన్ని రకాల అజ్ఞానం కూడా నాగరికతే ఏమో అని.

''అక్కడ అప్లికేషన్ నింపి ఇద్దరమూ మా ఎడ్యుకేషనల్ సర్టిఫికేట్ల కాపీలూ, నేను గర్భవతినని ధృవపరిచేపత్రం వారికిచ్చి వారు నిర్వహించిన పరీక్షరాసి. ఇంటర్వ్యూలో గట్టెక్కాం. ఫీజు కూడా చెల్లించాం. అప్పుడు వీళ్ళు పుట్టబోయే శిశువుకి తమ కాన్వెంటులలో ఎక్కడో ఒక చోట సీటు యివ్వడానికి అంగీకరిస్తూ రిజర్వేషన్ స్లిప్ ఇచ్చారు.''

ఆవిడ ఏం చెబుతోందో నా కర్థంకాలేదని నా వెర్రిమొహమే చెప్పి ఉంటుంది.

''ఇప్పుడు అంతా పోటీరోజులు కదా. అందులోనూ అమెరికన్ కాన్వెంటులో సీటంటే ఆషామాషీ కాదు. ఒకసారి పిల్లాడిని చేర్చగలిగామో ఇక వాడి చదువు గురించి చూడక్క పనిలేదు. అందుకే అన్నిపాట్లు పడ్డాం. ఐతే ఏం? ఫలితం తథ్యం'' వంతపాడుతున్నట్లే చెప్పాడు అబ్బాయి. నివ్వెరపోయాను. ఎప్పుడో ముసలి వాళ్ళమౌతామని యిప్పటి నుంచీ ఊతకర్ర పట్టుకోం కదా. అవి పాతకాలపు సామెత. అతిగా ముందు జాగ్రత్త పరులని హేళన చేస్తూ. నా తరంలోనూ చెదురు మదురుగా బాల్య వివాహాలు జరిగేవి. నేనే ఒక బాల్య వివాహం చూశాను ప్రత్యక్షంగా. ఆరేళ్ళ వధువు, పన్నెండేళ్ళ వరుడు. సంబంధం పైకి పోకుండా రిజర్వేషన్ అని గుసగుసలాడారు కొందరు ఆహూతులు. ఇంకా పూర్వకాలంలో స్త్రీ గర్భం దాల్చగానే ఆమె ఆడ శిశువుని ప్రసవిస్తుందని ఆశిస్తూ ఆ శిశువుకి వరసయిన మగపిల్లవాడు ఏమేనబావ ఉంటే పురోహితుడి చేతనో, కుర్రాడి చేతనో ఆ స్త్రీ గర్భానికి తాళి కట్టించేవారుట. అలాగ సంబంధం ఖాయపరచుకునేవారుట. ఒకవేళ ఆ స్త్రీ మగశిశువుని కంటే పురోహితుడూ, వరుడూ వరుడి తరపువారూ వచ్చి పదిమంది సమక్షంలో ఆ తాళి తెంపేసేవారట. ఆ మాదిరి పిండ వివాహాలూ, బాల్యవివాహాలూ, యుక్తవయసు రాని వారి వివాహాలు సాంఘిక దురాచారాలని నిరసించిన నాగరికత కడుపులోనే పిండానికే విద్యాలయంలో సీటు రిజర్వేషన్‌ని గొప్పగా తలచడం ఏమిటీ? ఏమయినా అంటే పోటీ అని సమాధానం.

''ఆ కాన్వెంటులో సీటివ్వడానికి వారు పెట్టిన షరతులలో మూడో నెలనుంచీ శిశువు గవర్నెస్ ఆలనలో ఉండాలి. అనే దానిని మీరు ఉల్లంఘించినా గవర్నెస్‌కి లంచమిచ్చి ఏడాదేడాదీ ఆమె నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ తీసుకున్నాం. మరో షరతు మూడేళ్ళు నిండగానే కాన్వెంటుకి అప్పగించడం. అది విధిగా పాటించవలసింది. అన్నట్లు పేరు కూడా అమెరికా పేరులో ఉండాలనేది మరో షరతు. కృష్ణ అని పేరు పెడితే మీకూ అమోదయోగ్యమే తరవాత క్రిస్ అని కాన్వెంటులో పిలుస్తారు. అమెరికన్ పేరులాగే ఉంటుంది.''

'ఇందుకా వీళ్ళు చక్కని తెలుగింటిని ఇంగ్లీషు మంగలం చేశారు! గవర్నెస్... ఆవిడ గౌనూ క్రిస్ అని పిలవడమూ రామరామ ఎంత భావదారిద్ర్యం! నీతి, జాతి, ఆత్మాభిమానం వదిలేసుకుని ఎంత అనుకరణా, అనుసరణా!' అని నేను అలాటి కొడుకుని కన్నందుకు ఆంధ్రుడిగా సిగ్గుపడుతూంటే– '' ఏడాది తిరిగేలోగా ఇంగ్లీషు మాట్లాడడమూ రాయడమూ... క్రమశిక్షణా వేళ ప్రకారం తినడం, నిద్రపోడం లేవడం తన పనులు తానే చేసుకోడం అన్నీ నేర్పేస్తారు'' ఎంతో గొప్పగా చెప్పాడు. ఇంక నేను నిగ్రహించుకోలేకపోయాను. ''అంటే మూడేళ్ళు నిండిన నేరానికి ముక్కుపచ్చలారని పిల్లాడని కూడా చూడకుండా నిర్దయగా కాలమనే ఊటీల బడి బందిఖానాలో పెట్టేసి నరాలయినా కుదుటపడని పెసరకాయలలాటి పసివాడి లేత వేళ్లన్న జ్ఞానమేనా లేకుండా కలంపట్టించి గంటలకొద్దీ రాయిస్తారా! అన్న ప్రాశనా నాడే ఆవకాయన్నట్లు కుర్రవాడు అంత శ్రమకి ఓర్వగలడా? నరాలు చచ్చుపడిపోవూ? వేళ్ళకి పట్టుండకుండా పోదూ? ఇందుకే కాబోలు యీనాటి వీరి చేతిరాత కుదురుగా అందంగా ఉండదు.

లేత వేళ్ళు ఎంత నొప్పి పెడతాయో! కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నా కాన్వెంటు వారు కరుణ చూపరు– పసివాడి మీద. ఎద్దుపుండు కాకికేం నొప్పి? వాడి ఆకలి వాడికే తెలియని పిల్లవాడికి తనపనులు తాను చేసుకోవటం తెలుస్తుందా? తోడు లేనిదే గడవలేని చిన్నవాడిని ఎక్కడికో పంపేసి ఎరిగిన వారెవరూ ఉండని చోట. చదువుపేరిట కర్మానికి వదిలిపెడతారా, కన్నతల్లి తండ్రులు! ఎంత కఠినత్వం! ఎంత ఘోరమయిన కలి!'' నేను ఆగ్రహమూ, ఆవేశమూ, ఆవేదనా అపుకోలేక కన్నీరు కారుస్తూ నిలదీశాను. కాని, నా కన్నీళ్ళూ నా ప్రశ్నలూ పరితాపమూ దున్నపోతుల మీద జడివానలే అయ్యాయి. వాళ్ళు విసుక్కుంటూ ముద్ద తినడం ఆపారు. అబ్బాయి ''నాన్నగారూ! మీరు పాతకాలంవారు. మీకేమీ తెలియదు. ఈ పోటీ రోజుల గురించీ, కంప్యూటర్ కాలం గురించీ వెనకటి తరాల వాళ్ళు ముందు చూపులేకుండా పందుల్లా కనిపారేయబట్టే దేశం పట్టనంత జనాభా. సుఖంగా జీవించకుండా పీకలు తెగేసే పోటీ. దేశం వదిలిపోతే తప్ప ప్రతిభకి దొరకని గుర్తింపు. వెనకటితరాల తెలివితక్కువకి శిక్ష మేం అనుభవిస్తున్నాం.''

తలదించుకున్నాను. నేను నేరస్తుల తరగతిలో లేకపోయినా నాకు కంప్యూటర్ల గురించీ యంత్రాల గురించీ జ్ఞానం లేక పోవచ్చు. కాని బాల్యం గురించీ, మనుషుల గురించీ, మానవత్వం గురించీ, మానవ సంబంధాల గురించీ బాగానే తెలుసు. వ్యక్తిత్వం, ఆత్మగౌరవం, దేశాభిమానం కలవాడినే. తండ్రినని కూడా చూడక ఎంతమాటన్నాడు! వీడా నా కొడుకు! ఇలాటి



వాడిని కన్నందుకు. వీడి నోట ఇలాంటి మాట పడవలసి వచ్చినందుకు నేనిక్కడికిక్కడే చని పోవాలి. కాని నేనే చనిపోతే కృష్ణ తరపున, బాల్యం తరపున కనీసం గొంతెత్తడానికీ ఎవరుంటారు?

''మా తెలివితక్కువకీ, తొందరపాటుకి మీ తరం శిక్ష అనుభవిస్తూంటే చూడడం సిగ్గుగానే ఉంది. కాని మే చేసిన తప్పు మీరూ చేస్తారా, యింత తెలివైనవాడూ నాగరీకులూ అయి ఉండి? కృష్ణముందు మీ కొడుకు ముందు దోషిగా తొందరపడిన వారిగా అజ్ఞానులుగా నేరస్తులుగా నిలబడే రోజుని చేతులారా తెచ్చుకోడం వివేకమా?'' దంపతులు తెల్ల బోయారు. నా ప్రశ్నల సూటిదనం వారిని తికమక పెట్టినట్లుంది.

''మేం వాడిపట్ల నేరం చేస్తున్నామా! వాడి భవిష్యత్తుకోసం యిప్పటికే లక్షలకొద్దీ ఖర్చు పెట్టాం. మరో సంతానం కలగకుండా నిరోధించుకున్నాం. ఇక ముందుకూడా వాడికి ఎక్కువ ఖర్చవుతుందని నేనూ ఉద్యోగం చేస్తూ కూడబెడుతున్నాను. వాడికోసం గవర్నెస్‌ని పెట్టాం. ఇవన్నీ నేరాలా, త్యాగాలా?'' కోపంగా అడిగింది కోడలు. ''ఎందుకు వాడు రేపు మమ్మల్ని నిలదీయగలడు?'' ఇనుము ఎర్రగా కాలి వేడిగా ఉన్నప్పుడే సమ్మెట, సుత్తి దెబ్బకి వొంగుతుందని '' విద్యనేర్వడం వయసు కొంచెం మీరినా సాధ్య మౌతుంది. విత్తం ఎవరి నుంచేనా పొందవచ్చు. కాని కాలం విలువ అవి తిరిగిరాకపోడంలోనే ఉంది. ఎంత అనంతమయినా గడిచిన క్షణం మళ్ళీరాదు. జారిపోయిన, దోచుకోబడిన బాల్యాన్ని ప్రపంచంలోని బంగారమూ, దేశదేశాలలోని అమెరికన్, యూరో డాలర్లూ, పౌండ్లూ, అన్నీ కలసినా కొనలేవు. ఏ వయసు కాముచ్చటూ, కళా. అందుకే మన దేశంలో కూడా అమెరికా మెప్పించి ప్రపంచ బ్యాంకు అప్పు సంపాదించేందుకు బాలకార్మిక చట్టాలు పెట్టారు. అనుకరణని మించిన పొగడ్త ఉండదని. కాని నువ్వు నీ కొడుకుని పంపబోతున్న విద్యాలయంలో వాడికి బాలకార్మికుడికంటే దారుణమయిన పరిస్థితే కలుగుతుంది. పగలు ఎంత శ్రమపడినా రాత్రికేనా బాలకార్మికుడు అమ్మానాన్నలని చేరుకుని వారి ప్రేమని పొందుతాడు. కాని కృష్ణకి బాల విద్యా కారాగారంలో ఆ అవకాశం కూడా ఉండదు. ప్రవాసంలో ఉండడమే. అమ్మోరికాకి బలివ్వడానికి నీ బిడ్డని తయారు చేయడానికి నీకు మనసొప్పిందా! మీ వంటికి కృష్ణ డా(ల)ర్లింగ్‌లా కనిపించవచ్చు. కాని నాకు పసివాడిగానే కనిపిస్తూ, నేను వాడిని నన్ను వాడూ వదిలి ఉండలేనంత అనుబంధం పెంచుకున్నాం. ఈ పోటీ రోజులలో డబ్బు వెంట వాళ్ళేకాక అన్నీ మరిచి తీసే పరుగులో పాపాయిలు మీకు రూపాయల్లాగో డాలర్లలాగో మాత్రమే కనిపించవచ్చు. కాని...నేను వెనకటి తరం వాడిని. మమత, మమకారాలు, వాత్సల్యం తెలిసినవాడిని కనుక హెచ్చరించ



## క్రతీనా చిలిపితనం....

క్రతీనా మంచి నటిగానే అందరికీ తెలుసు. కానీ ఆమె చిలిపితనం బహుశా ఎవ్వరికీ తెలియదేమో! ఇటీవల ఓ షూటింగ్‌లో తన చిలిపి ఆలోచనతో యూనిట్ మొత్తాన్ని ఉరుకులు, పరుగులు పెట్టించింది. గొంతు మార్చి అందరిని కంగారు పెట్టింది. పనివత్తిడితో క్రతినా కళ్ళు తిరిగి పడిపోయిందంటూ గొంతు మార్చి మైకులో గట్టిగా అరిచి చెప్పిందట. ఆ మాట వినగానే యూనిట్ సభ్యుల పై ప్రాణాలు పైనే పోయాయి. అప్పటికప్పుడు షూటింగ్‌కి పేకప్ చెప్పేసి అందరూ తలో దిక్కుకి పరుగులు పెట్టారు. అరగంట వెతికినా క్రతినా కనిపించకపోవడంతో యూనిట్‌లో అందరూ ఒకటే తెగ కంగారు పడిపోసాగారు. అలా అందరూ కంగారు పడుతుంటే క్రతినా బయటకొచ్చి గట్టిగా నవ్వడంతో అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. తానేదో జోక్ చేయబోతే అందరూ నిజమని నమ్మేశారంటూ ఆటపట్టించిందట!

కుండా ఉండలేకపోతున్నాను. మీరిద్దరూ మీకూ వాడికీ కూడా చాలా ద్రోహం చేయబోతున్నారు- వాడిని ఆ కాన్వెంటుకి తోలి''.

''నీతి చంద్రిక అయిందా? వాడిని మీరు మూడేళ్ళు వదలడం మాదే పొరపాటు. మీరెన్ని హెచ్చరికలు చేసినా సలహాలిచ్చినా నీతులు చెప్పినా మా నిర్ణయం మారదు. కృష్ణ మా కొడుకు'' తెగేసి చెప్పింది కోడలు. నా కెంత కోపం వచ్చిందంటే కృష్ణకాక అడ శిశువు పుట్టి ఉంటే డాలర్లకోసం ఆ పాపని అమెరికన్ పెంపకం పెంచి... అందాల రాణిని చేసి అమెరికాకి పంపేసి డాలర్లు చేసుకునే వారేమో! అనిపించి, అసహ్యమేసింది. వీళ్ళ ముఖం చూడలేక నా గదిలోకి పోయాను.

* * *

''చెప్పండి. నేను నా మిత్రుడికి వాడిపేరుకీ మా స్నేహానికి సంభవించబోతున్న ఆపదను మానవ హక్కులు, హెబియస్ కార్పస్, పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ (పిల్) ఏదో ఒక మార్గంలో కోర్టులో వ్యాజ్యం వేసి ఎదుర్కొనేందుకు మాకు తోడ్పడగలరా? బాల్యానికీ, బాల్య వృద్ధాప్యాల స్నేహానికీ, పెంచిన అనుబంధానికీ జరుగుతున్న అపాయాన్ని న్యాయస్థానానికి తీసుకెళ్ళగలరా?'' సూటిగా, ఆవేశంగా అడిగారు పతంజలి.

న్యాయవాది వోడిపోయినట్లు తలవంచుకుని తన అసమర్థతని ''సారీ'' అన్న రెండక్షరాలతోనూ తెలిపి వారివేపు చూడడానికి ముఖం చెల్లనట్లు పిరికివాడిలా ఆ గదిలోంచి వెళ్ళిపోయాడు.

''ఈ దేశంలో ఈ రోజులలో కనీసం పోరాడడానికేనా కలేజా మిగలనంత యంత్రాలయిపోయారు మనుషులు! ఊహు. వీళ్ళేం మనుషులు? మానవాకారంలో ఉన్న మరలు'' అని గొణుక్కుంటూ...కృష్ణ నెత్తుకుని లేచి ''ఫరావాలేదులే. అందరూ పిరికి వాళ్ళే ఉండరు. మనకీ మన స్నేహానికీ దన్నుగా నిలబడే వెన్నెముక గలవాడి కోసం వెతుకుదాం పద'' అంటూ పతంజలి, ఆయన స్నేహితుడికి ధైర్యం చెబుతూ బయటికు నడిచారు.

★